

ప్రగతి పథాన..

- హంద్రీనీవా విస్తరణ పరుగులు
- ఓర్వకల్లుకు పారిశ్రామిక వైభవం
- కూటమి ప్రభుత్వం రాకతో బాగుపడిన రహదారులు
- కందనవోలు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి
- టిడ్కో ఇళ్లు పేదలకు ఇవ్వాలి
- కర్నూలు స్మార్ట్‌సిటీ అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలి
- పాణ్యం నియోజకవర్గంలో 'ప్రజావేదిక'
- నేడు కర్నూలు జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు

కర్నూలు, మే 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి 11 నెలలు పూర్తయింది. జూన్ 11న ఏడాది సంబరాలు జరుపుకోవడానికి కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులు సన్నద్ధం అవుతున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రగతి వైపు అడుగులు పడ్డాయి. వైసీపీ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేసిన గుంతల దారులు బాగుపడ్డాయి. ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక ప్రగతికి బీజం వేశారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. కరువు సీమ జీవనాడి హంద్రీనీవా కాల్వ విస్తరణ పనులు పరుగులు పెడుతున్నాయి. ఇప్పుడిప్పుడే అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి. జూన్‌లో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం ఆరంభంలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ డబ్బులు తల్లులు, రైతుల ఖాతాలో జమ చేస్తామని ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా కరువు, వలసలతో నిత్యం తల్లడిల్లే కందనవోలు పశ్చిమ ప్రాంతం పల్లెసీమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి. వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల ప్రాజెక్టులు చేపట్టాలి. నిరుపయోగంగా ఉన్న ఏపీ టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని కోరుతున్నారు. కూటమి పార్టీల్లో కుమ్ములాటపై దృష్టి సారించాలి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మధ్య సమన్వయం చేయకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీనిపై అధినేత ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజావేదిక, మార్గదర్శి-బంగారు కుటుంబం (పీ-4) కార్యక్రమంలో భాగంగా శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూలు నగరానికి వస్తున్న సందర్భంగా చేపట్టిన ప్రగతి, చేయాల్సిన అభివృద్ధిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.


పత్తికొండ శివారులో హంద్రీనీవా ప్రధాన కాలువ ఆదోని రోడ్డు మలుపు వద్ద సీసీ లైనింగ్‌కు సన్నాహాలు


అసంపూర్తిగా ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్


హంద్రీనీవా కాలువపై అసంపూర్తిగా వేదావతి స్టేజ్-2 పంప్‌హౌస్

పేదరికం లేని సమాజమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పీ-4 కార్యక్రమంలో భాగంగా 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ఉగాది పర్వదినాన శ్రీకారం చుట్టారు. ప్రతి నెల మూడో శనివారం ఒక జిల్లాలో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నేడు సీఎం చంద్రబాబు జిల్లాకు రానున్నారు. పాణ్యం నియోజకవర్గం పరిధిలోని కల్లూరు అర్బన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత అధ్వర్యంలో అత్యంత పేదరికంలో మగ్గుతున్న రెండు కుటుంబాలను ఎంపిక చేసి దత్తత తీసుకుంటారు. పేదరికం నుంచి ఆ కుటుంబాలను పైకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు చేయూత అందిస్తాయి. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో కేంద్రీయ విద్యాలయం పక్కనే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత, జిల్లా కలెక్టరు రంజిత్ బాషా ప్రతిష్టాత్మకంగా తీసుకొని 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రగతి పరుగులు

- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నారు. వివిధ పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.
- జపాన్‌కు చెందిన ఇటోయె మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, ఇండియాకు చెందిన హైడ్రెన్ గ్రూప్, బీఎన్ గ్రూపులు సంయుక్తంగా దాదాపు రూ.14వేల కోట్ల పెట్టుబడులతో సెమీ కండక్టర్ తయారీ పరిశ్రమను 130 ఎకరాల్లో స్థాపించేందుకు ఒప్పందం చేసుకున్నారు. 1200 ఎకరాల్లో రూ.13వేల కోట్లతో 'ఈవీ పార్క్' ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. 300 ఎకరాల్లో రూ.వెయ్యి కోట్లతో డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నారు.
- ఉమ్మడి జిల్లాలో రూ.690 కోట్లతో హంద్రీనీవా విస్తరణ చేపట్టారు. జూలై 10 తరువాత 3,860 క్యూసెక్కులు కృష్ణా జలాలు తీసుకోవాలని లక్ష్యం. కరువు రైతులకు పెద్ద ఊరట ఇది.
- గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమల్లో భాగంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కసరత్తు దాదాపు పూర్తయింది. లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, లా డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి వి.సునీ అక్టోబరు 28న నంబరు. 2589691/ఎస్‌సీ.ఎఫ్/ఏ2/2024 కింద హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు.

మిగతా 7వ పేజీలో..


కర్నూలు నగరం జగనాథగట్టులో నిర్మించిన ఏపీ టిడ్కో ఇళ్లు

అందరినీ భాగస్వాములను చేయండి

- చలువ పందిళ్లు ఏర్పాటుకు చర్యలు
- కలెక్టర్ రాజకుమారి
- 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'పై అధికారులతో సమీక్ష



నంద్యాల నూనెపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్ నుంచి 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమ పటిష్ట అమలుపై ఈనెలలో వేడి ప్రభావాలు తగ్గించే అంశంపై జిల్లా, మండల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ మూడో శనివారం నిర్వహించే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా వేడి ప్రభావాలను తగ్గించే అంశాలపై కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేయాలని ఆదేశించారు. జనవరి నుంచి ఇప్పటివరకు నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, థీమ్‌లో పేర్కొన్న అంశాలను ప్రతి కార్యాలయంలో గోడకు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. వేడి ప్రభావాలను తగ్గించడానికి ట్రాఫిక్ కూడళ్లు, మార్కెట్లు, బస్టాప్ లు, మతపరమైన ప్రదేశాలు ఇతర పబ్లిక్ పాయింట్లవద్ద చలువపందిళ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీల కోసం ఎకో కూల్‌రూఫ్ టెక్నాలజీ వినియోగంతోపాటు సమ్మర్ డ్రైవ్‌లో పబ్లిక్, ఇన్‌స్టిట్యూషనల్ ఈవెంట్లలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి పునర్వినియోగ బాటిళ్లను ప్రోత్సహించా లన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఇతర అంశాలపై అధికారులతో ఆమె చర్చించారు.

ప్రణాళికలు రూపొందించండి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేదిశగా అన్నిశాఖలు వార్షిక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా అభివృద్ధి 2025-26 కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై జిల్లా అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. వ్యవసాయానికి సంబంధించి 50వేల ఎకరాల్లో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయానికి అదనంగా మరో 25వేల ఎకరాలకు పెంచే ప్రణాళికలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. విద్యుత్‌శాఖకు సంబంధించి పీఎం సూర్యఘర్‌ద్వారా కనెక్షన్లు అందజేసి లబ్ధిదారులను పెంచేలా చర్యలు చేపట్టాల న్నారు. పీఎం కుసుమ్‌కు 500ఎకరాలు భూసేకరణ పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఏపీ టూరిజం, రవాణా, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే, హౌసింగ్, టిడ్కో, స్కిల్‌డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా, ఇరిగేషన్, గ్రౌండ్‌వాటర్, సివిల్‌సప్లై, విద్య, వైద్యం, ఆరోగ్యశాఖ, స్త్రీ శిశుసంక్షేమశాఖ, కార్మికశాఖ, ఆర్టీసీ, ఫుడ్‌సేఫ్టీ, ఎస్సీ కార్పొరేషన్ తదితర శాఖల కార్యాచరణ ప్రణాళికలను కలెక్టర్ పరిశీలిస్తూ చేర్చాల్సిన అంశాలపై సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీపీఓ వేణుగోపాల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రేడియాలజిస్ట్ నియామకం

అందుబాటులో అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు


జీజీహెచ్‌లోని అల్ట్రాసౌండ్ స్కానర్

నంద్యాల హాస్పిటల్, మే 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్‌లో మూడేళ్ల నుంచి ఖాళీగా ఉన్న రేడియాలజిస్ట్‌ను ఎట్టకేలకు నియమించారు. దీంతో ప్రజలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. జీజీహెచ్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను రేడియాలజిస్ట్‌గా నియమించారు. మిషన్లు ఉన్నా సేవలు అందక ప్రజలు మూడేళ్ల నుంచి ఇబ్బందులు పడ్డారు. స్కానింగ్ కోసం ప్రైవేట్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ప్రైవేట్ నిర్వాహకులు ఒక్కో స్కానింగ్ తీయడానికి రూ.1500నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో ఉచితంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు అందించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు.

'సదరం'లో కంటి పరీక్షలు

2230మందికి రీ వెరిఫికేషన్ పూర్తి

నంద్యాల హాస్పిటల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సదరం క్యాంప్‌లో రీ వెరిఫికేషన్‌లో భాగంగా కంటిచూపు కోల్పోయిన దివ్యాంగులకు ప్రత్యేక శిబిరంలో పరీక్షలు పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా 2230మంది దివ్యాంగులు రీ వెరిఫికేషన్ చేయించుకున్నారు. జనవరి 21నుంచి మే 9వ తేదీ వరకు సదరం క్యాంప్‌లో కంటి పరీక్షలకు సంబంధించి రీ వెరిఫికేషన్ జరిగింది. శుక్రవారం నంద్యాల జీజీహెచ్‌లో ఆర్థో 132మంది, వినికిడి లోపం ఉన్నవారు 44మంది, మానసిక వికలాంగులు 35మంది రీ వెరిఫికేషన్ కోసం హాజరయ్యారు.


సదరం శిబిరానికి వచ్చిన దివ్యాంగులు

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

- 1,700 మంది పోలీసులతో బందోబస్తు
- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు నగరం పర్యటన సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఓర్వకల్లు ఎయిర్ పోర్టు నుంచి ప్రజావేదిక సభ జరిగే నంద్యాల చెక్‌పోస్టు వరకు, నంద్యాల చెక్‌పోస్టు నుంచి సీ.క్యాంపు వరకు, నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని పా ర్కు వరకు సీఎం పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం శుక్రవారం పర్యటించాయి.

మిగతా 6వ పేజీలో

పొరపాట్లు జరిగితే మీదే బాధ్యత

- అర్జీలు స్వీకరించేందుకు కౌంటర్ ఏర్పాటు
- స్టేజీ, స్టాల్స్, పార్కింగ్ ఏర్పాట్లపై సూచనలు
- కలెక్టర్ పి.రంజిత్ బాషా
- ప్రోగ్రాం కోర్డినేటర్, ఎస్పీతో కలిసి పనుల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కలెక్టర్ రంజిత్ బాషా , ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు అగ్రికల్చర్, మే 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు సి.క్యాంపు రైతుబజారు పర్యటనలో చిన్న పొరపాటు జరిగినా మార్కెటింగ్ శాఖ యంత్రాంగానిదే బాధ్యత అని కలెక్టర్ రంజిత్‌బాషా స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ సి.క్యాంపు రైతుబజారుతో పాటు ప్రజావేదిక వద్ద జరుగుతున్న పనులను ఏపీ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేశ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి పరిశీలించారు. సి.క్యాంపు రైతుబజారు, ప్రజావేదిక, స్వచ్ఛాంధ్ర పార్కు ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమాలకు సంబంధించి జరుగుతున్న పనులపై వారు సంతృప్తి వ్యక్తంచేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి సంబంధించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు కౌంటర్ ఏర్పాటుచేయడంతో పాటు బ్యానర్ ఏర్పాటుచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ డ్వామా పీడీలను ఆదేశించారు. స్టేజీ, స్టాల్స్ కాన్వాయ్, వీఐపీ పార్కింగ్ ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించి ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు చేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ డా.బి.నవ్య, మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత, కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, కడప జేడీ రామాంజనేయులు ఉన్నారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ

కర్నూలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులకు అనుమతి ఇవ్వడంతో అర్హులైన వారందరూ రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. రేషన్ కార్డులో కొత్తవారు చేరిక, చిరునామాలో మార్పులు, చేర్పులు తదితర సవరణల కోసం శుక్రవారం నాటికి 13,922 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 17 మంది రేషన్ కార్డుదారులు తమ రేషన్ కార్డులను తొలగించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆదోని డివిజన్‌లోని రేషన్ కార్డులోకి కొత్తవారు చేరిక కోసం 5,429 మంది, కొత్త రేషన్‌కార్డు కోసం 237 మందితో పాటు అడ్రస్ మార్పులు, చేర్పులు తదితర సవరణల కోసం మొత్తం 481 మంది దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలు డివిజన్‌లోని రేషన్‌కార్డులోకి కొత్తవారి చేరిక కోసం 3,516 మంది, కొత్త రేషన్‌కార్డుల కోసం 277మందితో పాటు అడ్రస్ మార్పులు, చేర్పులు తదితర సవరణల కోసం మొత్తం 458 మంది దరఖాస్తులు చేసుకున్నారు. పత్తికొండ డివిజన్‌లోని రేషన్‌కార్డులోకి కొత్తవారు చేరిక కోసం 2,959 మంది, కొత్త రేషన్‌కార్డు కోసం 232 మందితో పాటు అడ్రస్ మార్పులు, చేర్పులు సవరణల కోసం 333మంది దరఖాస్తు చేసుకున్నారు.

21న డీఈవో కార్యాలయాల ముట్టడి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 21న ఉమ్మడి నంద్యాల, కర్నూలు జిల్లాల డీఈవో కార్యాలయాల ముట్టడి కార్యక్రమం చేస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. వైసీపీ ప్రభుత్వం ఆరురకాల పాఠశాలలను ప్రవేశపెడితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలను ప్రతిపాదించి అమలుచేసేందుకు పూనుకోవడం ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని పేర్కొన్నారు.

పాక్ దాడులకు భారత్ బెదరదు

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- 'ఆపరేషన్ సిందూర్' విజయంపై హర్షం
- కర్నూలు నగరంలో భారీగా తిరంగ ర్యాలీ
- ప్రారంభించిన మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ దాడులకు బెదిరేదీ లేదని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 140 కోట్ల ప్రజలకు సూచించారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ఆపరేషన్ సిందూర్' విజయానికి సంఘీభావం తెలుపుతూ కర్నూలు నగరంలో భారీ తిరంగ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ వద్ద ఈర్యాలీని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాణనష్టం లేకుండా పాకిస్థాన్‌పై దాడిని విజయవంతం చేయడం యావత్ భారత దేశం గర్వపడుతుందన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయంపై ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ భారత దేశ సైనికులకు మద్దతుగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా తిరంగ ర్యాలీ నిర్వహించడం హర్షణీయమన్నారు. ఆదోని ఎమ్మెల్యే వాల్మీకి పార్థసారధి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. జనసేన పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి చింతా సురేష్‌కుమార్ మాట్లాడుతూ వీరజవాన్లకు



140కోట్ల మంది ప్రజల మద్దతు ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కే.చెన్నయ్య, మధు మోహన ఆచారి, సుధాకర్, రామస్వామి, రామకృష్ణ, డీసీసీబీ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ నాయకులు కేవీ సుబ్బారెడ్డి, జనసేన నాయకులు పీబీవీ సుబ్బయ్య, 17వ వార్డు కార్పొరేటర్ పద్మలతారెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న టీజీ భరత్, టీజీ వెంకటేశ్ తదితరులు



నగరంలోని రాజ్‌విహార్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు విద్యార్థులు



సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

(5వ పేజీ తరువాయి)

ఓర్వకల్లు నుంచి సీ.క్యాంపు రైతుబజారు వరకు ఉన్న మార్గాల్లో పలు క్రాస్ రోడ్లు ఉండటంతో పాటు కర్నూలు నగరంలో చెక్ పోస్టు నుంచి సీ.క్యాంపు వరకు తీవ్ర రద్దీ ఉన్న నేపథ్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాలోని పోలీసులను ఈ బందోబస్తుకు నియమించారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని కేంద్రీయ విద్యాలయం ఎదురుగా ఉన్న మెగా సిరి ఫంక్షన్ హాలులో పోలీసులకు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పలు సూచనలు, సలహాలు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే రూట్ అండ్ రూఫ్ - టాప్ ప్రాంతాల్లో, సీఎం కాన్వాయ్, సభప్రాంగణం తదితర ప్రాంతాల్లో బందోబస్తు విధులు నిర్వహించే మఫ్టీ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగీలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసు అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు 1700 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో నలుగురు ఏఎస్పీలు, 11 మంది డీఎస్పీలు, 53 మంది సీఐలు, 101 మంది ఎస్‌ఐలు, 383 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 680 మంది కానిస్టేబుళ్లు, 51 మంది మహిళా పోలీసులు, 416 మంది హోంగార్డులు, 5 సెక్షన్ల ఏఆర్ సిబ్బంది, 6 స్పెషల్ పార్టీ బృందాలను బందోబస్తు విధులకు కేటాయించామన్నారు. ఈ పరిశీలనలో ఏఎస్పీ (అడ్మిన్) హుసేన్‌పీరా, ఏఆర్ ఏఎస్పీ కృష్ణమోహన్ కర్నూలు రేంజ్ పరిధిలోని ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి సీ.క్యాంపు రైతుబజారు వరకు ఏర్పాట్లన్నీ చకచకా పూర్తయ్యాయి. ఆగమేఘాల మీద యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు సిద్ధం చేశారు. జాతీయ రహదారిపై ఉన్న గుంతలన్నీ వెంట వెంటనే తారుతో పూడ్చివేశారు. ఈ మార్గంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లన్నీ తొలిగించారు. డీవైడర్లకు రంగులు వేసి ముస్తాబు చేశారు. రైతుబజారు సమీపంలో ఉన్న చెత్తను తొలిగించేశారు. రోడ్డుకిరువైపులా గ్రావెల్ వేసి చదును చేశారు. పూర్తిగా దెబ్బతిన్న చోట బీటీ రోడ్డు వేశారు.

వాహనాల రాకపోకలు మళ్లింపు

ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూలులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి వస్తున్న సందర్భంగా పోలీసులు శనివారం ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాహనాల రాకపోకలపై పలు ఆంక్షలు విధించారు. వివిధ ప్రాంతాల నుంచే వచ్చే వాహనాల రాకపోకలను మళ్లించారు.

- ఆత్మకూరు, నందికొట్కూరు నుంచి వచ్చే వాహనాలు గార్గేయపురం ఎన్‌హెచ్ 350సీ మీదుగా సఫా కాలేజీ రింగ్ రోడ్డు, గుత్తి పెట్రోల్ బంకు, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండుకు వెళ్లాలి.
- నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్ వైపు వెళ్లే వాహనాలు ఆర్టీసీ బస్టాండు నుంచి బళ్లారి చౌరస్తా, గుత్తి పెట్రోల్ బంకు, రింగ్ రోడ్డు సఫా కాలేజీ మీదుగా ఎన్‌హెచ్-40, ఎన్‌హెచ్-350 సీ హైవేల నుంచి వెళ్లాలి.
- డోన్, అనంతపురం వైపు నుంచి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంకు చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండుకు వె ళ్లాలి. ప్రజలు ట్రాఫిక్ మళ్లింపును గమనించి సహకరించాలని తెలిపారు.

సీఎం వస్తేకానీ పట్టించుకోరా?

- ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు
- ఒక్క రోజులో రోడ్లు, డ్రైనేజీలు, రంగులు
- అధికారుల తీరుపై ప్రజల్లో అసహనం



రోడ్డు వేస్తున్న దృశ్యం

కర్నూలు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు వస్తున్నారని అధికారులు అత్యుత్సాహంతో చేసిన అభివృద్ధి పనులపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కాలనీలకు రోడ్లు సదుపాయం లేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఆవైపు కూడా వెళ్లి చూడలేదు. కానీ సీఎం వస్తున్నారని ఆగమేఘాలపై రోడ్లు వేయడం, కాలువలు శుభ్రం చేయడం, తదితర అభివృద్ధి పనులు చేయడంపై ప్రజలు భిన్నంగా స్పందించారు. సీఎం చంద్రబాబు వస్తే కానీ వాళ్లకు సమస్యలు పట్టవా? అంటూ అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు. గత మూడు నెలలుగా నంద్యాల చెక్‌పోస్టులో చలువ పందిళ్లు వేయని అధికారులు ఒక్కరోజులో సీఎం వస్తున్నారని చలువ పందిళ్లు వేయడం, అది కూడా ఎండలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఏర్పాటు చేయడం హాస్యాస్పదంగా ఉందంటూ ప్రజలు చర్చించుకున్నారు.

మరో వైపు చెక్‌పోస్టు నుంచి పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వరకు ఉన్న రోడ్డు మొత్తం పూర్తిగా దెబ్బతింది. ఈ మార్గంలో వాహనదారులు నెలల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ సీఎం వస్తున్నారనీ ఆఘమేఘాల మీద కొత్త బీటీ రోడ్డు వేశారు. అధికారులు తలుచుకుంటే రెండు రోజుల్లోనే అన్ని సమస్యలు తీర్చవచ్చని, అలాంటిది ఏళ్ల తరబడి పనులు పెండింగ్‌లో పెట్టడం, ఎవరో వీఐపీలు వస్తున్నారని పనులు పూర్తి చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.



మురుగు తొలగిస్తున్న దృశ్యం

ప్రపంచ దేశాల్లో భారత్‌కు అగ్రస్థానం

- రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రంలో ముగిసిన 'జై జవాన్ కల్చరల్ ఫెస్ట్'



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


కర్నూలు కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో భారత ప్రధాని మోదీ వల్ల భారత్ అగ్రస్థానంలో నిలిచిందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. మన సైన్యం ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేయడంలో చేసిన ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం ప్రపంచ ప్రశంసలు అందుకుందన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రం వారం రోజులుగా కొనసాగిన జై జవాన్ కల్చరల్ ఫెస్ట్ శుక్రవారం రాత్రి ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన టీజీ వెంకటేశ్ తొలుత జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం భరత మాత చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన జన్మదిన భారీ కేక్‌ను కట్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచీ దేశభక్తిని ప్రబోధించే కార్యక్రమాలు టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేస్తూ దేశ సైనికులకు సంఘీభావంగా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. తమ కుటుంబంలో తాత తండ్రుల నుంచీ స్వాతంత్ర్య సమరయోధులనీ, దేశభక్తి, సేవా సహకార గుణాలు కలవారిని గుర్తు చేశారు. కర్నూలు రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉండేటట్లు తన కుమారుడు మంత్రి టీజీ భరత్ కృషి చేస్తున్నారని తెలిపారు. చిత్ర నిర్మాత, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలోనే మహోన్నతమైన వ్యక్తిగా టీజీ వెంకటేశ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రంలో రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌ను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, కాపు సంఘం రాష్ట్ర నాయకుడు ఆర్జా రామకృష్ణ తదితరులు మాట్లాడారు.

నవ్వులు పూయించిన జబర్దస్త్ కళాకారులు

జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో ముగింపు వేడుకల్లో భాగంగా జబర్దస్ కళాకారుల హాస్యవల్లరి కార్యక్రమం అసాంతం ప్రేక్షకులను అలరింపజేసింది. జబర్దస్త్ కళాకారులు అప్పారావు, వినోదిని, గడ్డం నవీన్, కార్తీక్, రాజమౌళి ప్రదర్శించిన స్కిట్లు ప్రేక్షకులను అలరించాయి. అంతకు ముందు నాట్యాచార్యుడు కరీముల్లా బృందం దేశభక్తిని చాటిచెబుతూ చేసిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. అలాగే గజల్ గాయకుడు మహమ్మద్ మియా బృందం జానపద గీతాలు దేశ భక్తిని చాటి చెప్పాయి. ఈ కార్యక్రమంలో జీవీ శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, జీవీ రమణ, యాంగటీశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.



జబర్దస్త్ కళాకారుల ప్రదర్శన



బీపీడితులు

- రోజురోజుకూ పెరుగుతున్న హైపర్ టెన్షన్ బాధితులు
- 30-40 ఏళ్ల వయస్సు ఉన్నవారే అధికం
- మెదడు, కిడ్నీ, గుండె సమస్యలకు దారి
- జీవన శైలి మార్పులు, మందులతో అదుపు
- నేడు ప్రపంచ రక్తపోటు దినం

కర్నూలు హాస్పిటల్, మే 16(ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటు (హైబీపీ) సైలెంట్ కిల్లర్. ఇటీవల కాలంలో హైబీపీ బాధితుల సంఖ్య పెరుగుతుంది. ఒకప్పుడు పెద్దవారిలో కనబడే బీపీ. ప్రస్తుతం 30, 40 ఏళ్ల వయస్సు వున్న వారిలో కనబడుతుంది. బీపీ వల్ల మెదడు, కిడ్నీ, గుండె, వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. రక్తానికి గొడ్డలిపెట్టులా మారిన హైబీపీని జీవన శైలి మార్పులు, మందులతో సులభంగా అదుపులో ఉంచుకోవచ్చు. మనదేశంలో 19 కోట్ల మంది హైబీపీతో బాధపడుతున్నారు. వీరిలో దాదాపు 50 శాతం మందికి జబ్బు ఉన్న సంగతే తెలియకపోవడం విశేషం. తెలిసిన వారిలో ప్రతి ఐదు మందిలో నలుగురే సరైన చికిత్స తీసుకుంటున్నారు. బీపీకి ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, నిద్రలేమి కారణా లు కాగా, 40 ఏళ్లు దాటినవారిలో బీపీ సర్వసాధారణంగా మారింది. హైపర్‌టెన్షన్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ రక్తపోటు దినంను నిర్వహిస్తున్నారు. 'మీ రక్తపోటును ఖచ్చితంగా కొలవండి.. దానిని నియంత్రించండి.. ఎక్కువ కాలం జీవించండి' అన్న నినాదాన్ని వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్ ఈ ఏడాది నినాదాన్ని ఇచ్చింది.

- అధిక రక్తపోటుతో కంట్లోని రక్త నాళాలు దెబ్బతిని చూపు మందగించే ప్రమాదం ఉంది.
- ఆహారంలో ఉప్పు బాగా తగ్గించుకోవాలి. చిప్స్, నిల్వ పచ్చళ్లు తినడం, పెరుగు మజ్జిగలో ఉప్పు కలపడం మానివేయాలి.
- ఆకుకూరలు, పండ్లు, ఎక్కువగా తినాలి
- వెన్న తీసిన పాలు, పెరుగు వాడుకోవాలి.
- రోజుకు 45నిమిషాలు చొప్పున వారానికి కనీసం ఐదు రోజులు వ్యాయా మం చేయాలి
- అధిక బరువు తగ్గించుకోవాలి. ఒక కిలోబరువు తగ్గినా రక్తపోటు 1 ఎంఎంహెచ్‌జీ తగ్గుతుంది.
- సిగరెట్లు, చుట్టలు, బీడీలు తాగితే రక్తనాళాల గోడలు దెబ్బతింటాయి. మద్యంతో రక్తపోటు పెరుగుతుంది. దీని జోలికి వెళ్లకపోవడం మంచిది.

అధిక రక్తపోటును..

అధిక రక్తపోటును రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి ఇతరత్ర సమస్యలతో ముడి పడనిది (ప్రైమరీ హైపర్ టెన్షన్) 95 శాతం కనిపించేది బీపీ ఇదే. రెండోది ఇతర జబ్బులతో ముడిపడినది (సెకండరీ హైపర్ టెన్షన్) కిడ్నీ వైపల్యం, థైరాయిడ్, అడ్రినల్ గ్రంధి సమస్యలు గర్భిణుల్లో వచ్చే బీపీ, పుట్టుకతోనే గుండె రక్తనాళాల్లో లోపాలు ఉండటం. రక్తనాళాల లోపల కందిపోయి, వాపు తలెత్తడం వంటివి దీనికి దోహదం చేస్తాయి.

130/80 కన్నా తక్కువగా ఉంటే..

130/80 కన్నా తక్కువగా ఉంటే బీపీ నార్మల్. 140/90 కన్నా ఎక్కువగా ఉంటే హైపర్‌టెన్షన్ బీపీ ఉన్నట్లు గుర్తించాలి. రెండు, మూడు సార్లు నిపుణులైన వైద్యులతో చెక్ చేయించుకుని 140/90 కంటే ఎక్కువగా ఉండే హైపర్‌టెన్షన్ బీపీ ఉన్నట్లు భావించి వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి. రక్తపోటును ని యంత్రించడానికి రకరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఎవరికి ఏ మందు అవసరమనేది ఆయా వ్యక్తుల ఆరోగ్యస్థితిని బట్టి నిర్ధారిస్తారు.

గుండె జబ్బు : గుండె రక్తనాళాల్లో పూడికలు ఏర్పడితే గుండె పోటు రావొచ్చు. దీర్ఘకాలికంగా రక్తపోటు ఎక్కువగా ఉంటే గుండె కండరం మందు కావొచ్చు. దీంతో కండరం వ్యాకోచించే స్వభావం తగ్గి ఫలితంగా ఒత్తిడి పెరిగి, గుండె వైఫల్యానికి దారి తీస్తుంది.

పక్షవాతం : మెదడు రక్తనాళాల్లో పూడికలు గలవారికి సమస్యలు వస్తాయి. మెదడులో ఆయా భాగాలకు రక్తసరఫరా ఆగిపోయి పక్షవాతం తలెత్తవచ్చు. రక్తనాళాల్లో పూడికలు ఏర్పడితే మూత్రపిండాలకు రక్తసరఫరా తగ్గిపోతుంది. అదే పనిగా రక్తపోటు ఎక్కువగా ఉండటం మూలంగా కిడ్నీల పనితీరు తుంది.

ప్రతి రోజు ఓపీకి వంద మంది



ప్రతి రోజు ఓపీ నెంబరు9లో 100 మంది హైపర్ టెన్షన్ బాధితులు వస్తుంటారు. ఈ రోగులకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. బీపీ ఉంటే రెగ్యులర్‌గా మందులు వాడాలి. 40 ఏళ్లు దాటినవారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రెగ్యులర్‌గా బీపీ పరీక్షలు చేయించుకోవాలి.

- డా.డి.శ్రీరాములు, సీనియర్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

పెద్ద ప్రమాదం..



అధిక రక్తపోటుతో పెద్ద ప్రమాదం ఉంటుంది. పైకి ఎలాంటి లక్షణాలు లేకపోవడం, రక్తపోటు పెరిగినా మాములుగానే ఉంటారు. హైపర్ టెన్షన్ ఎక్కువై అవయవాలు దెబ్బతిని హాస్పిటల్‌కు ఇటీవల వచ్చేవారి సంఖ్య పెరుగుతుంది. రక్తపోటును తగ్గించే చికిత్సతో పక్షవాతం ముప్పు 40శాతం, గుండె వైఫల్య ప్రమాదం 50 శాతం, హార్ట్ ఎటాక్‌లు 20-25 శాతం తగ్గించొచ్చు.

- మీనుగ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు



విద్యుత్ శాఖపై ఏసీబీ దాడులు

- డిప్యూటీ ఈఈ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై కేసు




పట్టుబడ్డ ప్రతాప్(ఔట్ సోర్సింగ్), డిప్యూటీ ఈఈ రవికాంత్ చౌదరి

రుద్రవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖపై ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. డిప్యూటీ ఈఈ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. వివరాలు.. మండలంలోని చిన్నకంబలూరు గ్రామానికి చెందిన రైతు లింగమూర్తి తన కుమారులైన శేఖర్, శివలింగంమూర్తి అనే ఇరువురి పేర్లపై ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాల కోసం 21.5.2024 తేదీన దరఖాస్తు చేసుకున్నాడు. విద్యుత్ అధికారులు అంచనాలు సిద్ధంచేశారు. వాటికి సంబంధించి రూ.18640లు 3.7.2024లో రైతు చెల్లించాడు. విద్యుత్ డిప్యూటీ ఈఈ రవికాంత్‌చౌదరి వద్దకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాల కోసం సంప్రదించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రతాప్‌ను సంప్రదించాలని డిప్యూటీ ఈఈ సూచించారు. ప్రతాప్ రూ.40వేలు డిమాండ్ చేయగా రూ.30వేలకు బేరం కుదుర్చుకున్నారు. శుక్రవారం సాయంత్రం రైతులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ప్రతాప్‌కు రూ.30వేలు అందించారు. వెంటనే ఏసీబీ సిబ్బంది దాడిచేసి ఉద్యోగిని, నగదును స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ ఈఈతో పాటు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐలు క్రిష్ణయ్య, రాజ ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్నఏసీబీ డీఎస్పీ సోమన్న

నమ్మించి.. మోసగించాడు

- అన్నదాతను దగా చేసిన బడి పంతులు
- పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం

ఆళ్ళగడ్డ, మే 16(ఆంధ్రజ్యోతి): రైతన్నను నమ్మించి మోసగించాడు ఓ బడి పంతులు. దిక్కు తోచని స్థితిలో ఆరైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. స్థానిక ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ పాఠశాలలో బాబు అనే వ్యక్తి టీచర్ పనిచేస్తున్నాడు. రైతు కోటేశ్వరరావుకు చెందిన పొలాన్ని తీసుకుని ప్లాట్లు వేసేందుకు బాబు సిద్ధమయ్యాడు. ఈ మేరకు కొంత అడ్వాన్స్‌ను రైతు చెల్లించాడు. వెంచర్ వేసి ప్లాట్లు అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడు. చివర్లో లెక్కలు చేసి డబ్బులు ఇస్తానని నమ్మి బలికి విడతలవారీగా డబ్బులు ఇస్తూ మొత్తం పొలం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నాడు. తనకు రావాల్సిన పదిలక్షలు చెల్లించాలని రైతు అడిగాడు. దీంతో అతడిని బెదిరించాడు. కోటేశ్వరరావు అధికారులను, నాయకులను ఆశ్రయించినా ఫలితం లేదు. దీంతో మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురై శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు రైతును హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారులు స్పందించి తన సమస్యను పరిష్కరించాలని బాధిత రైతు కోరుతున్నాడు.



చికిత్స పొందుతున్న రైతు కోటేశ్వరరావు

చల్లా విఘ్నేశ్వరరెడ్డిపై కేసు నమోదు



బనగానపల్లె మే 16 (ఆంధ్ర జ్యోతి): అవుకు పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు చల్లా విఘ్నేశ్వరరెడ్డిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన రథోత్సవంలో టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్ మీదికి విఘ్నేశ్వరరెడ్డి దూసుకెళ్లి ఘర్షణకు దిగాడు. అతడి ఫిర్యాదు మేరకు విఘ్నేశ్వరరెడ్డితో పాటు పోతిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గొల్ల మనోహర్, చాకలి వెంకటేశ్వర్లుపై కేసులు నమోదు చేశారు. చెన్నకేశవస్వామి ఆలయం దేవదాయశాఖ పరిధిలో ఉన్నప్ప టికీ గతంలో ఏకపక్షంగా చల్లా కుటుంబీకుల ఆధ్వర్యంలో రైతుసంఘం వారు చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవా లను నిర్వహించేవారు. ఈఏడాది దేవాదాయశాఖ అధికారులు బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తు న్నారు. ఇది చల్లా కుటుంబీకులకు మింగుడు పడలేదు. దేవుడు రథం తేరువీధి నుంచి చల్లా ఇంటిముందు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడికి వచ్చే సరికి నిలువకుండ ముందుకు వెళ్లాలని విఘ్నేశ్వరరెడ్డి వెంకటరమణ నాయక్‌తో ఘర్షణకు దిగాడు. సీఐ మంజునాథ రెడ్డి, ఎస్ఐ రాజారెడ్డి అక్కడకు చేరుకొని విఘ్నేశ్వర రెడ్డిని పక్కకు తీసుకెళ్లారు. అప్పటికి ఘర్షణ సద్దుమణిగి రథోత్సవం సజావుగా సాగింది. వెంకటరమణనాయక్ ఫిర్యాదు మేరకు నలుగురిపై పోలీసులు కేసు నమోదుచేశారు.

చల్లాపై తప్పుడు కేసు నమోదు : కాటసాని

బేతంచెర్ల: చల్లా విఘ్నేశ్వరరెడ్డిపై తప్పుడు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం తగదని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శుక్ర వారం సాయంత్రం బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో కాటసాని రామిరెడ్డి విలేకరులతో మాట్లా డారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమల వుతుందని, అదే విదంగా బనగానపల్లె నియోజకవర్గంలో కూడా రెడ్‌బుక్ ర్యాంగంను రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. విఘ్నేశ్వరరెడ్డి ఎలాంటి తప్పు చేయలేదన్నారు. వైసీపీ నాయకులు మాజీ ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చల్లా విఘ్నేశ్వరరెడ్డిని పోలీస్‌స్టేషన్‌లో పరామర్శించారు.

ప్రగతి పథాన..



మొండిగోడలతో ఉర్దూ విశ్వవిద్యాలయం

(5వ పేజీ తరువాయి)

పత్తికొండ మండలం కనకదిన్నె వద్ద రెండు ఎకరాల్లో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.11 కోట్లతో శంకుస్థాపన చేశారు.

- ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో చేనేతలకు ఉపాధి లక్ష్యంగా 97.24 ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు.

జలసిరులు రావాలి.. కరువు తీరాలి

- మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు, వలసలు నివారించాలని 2019లో నాటి టీడీపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువ చేపట్టింది. 40 వేల ఎకరాలకు సాగు, 1.20 లక్షల జనాభాకు తాగునీరు అందించాలని రూ.1,985.42 కోట్లతో పనులు మొదలు పెట్టారు. ప్రధాన కాలువ, కోటేకల్లు, కోసిగి, పెద్దకడుబూరు, చిన్నమరివీడు జలాశయాల నిర్మాణాలు చేయాలి. వైసీపీ ప్రభుత్వంలో అటకెక్కించారు.
- ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల జనాభాకు సాగునీటి అందించాలని వేదవతి ఎత్తిపోతల పథకం రూ.1,94.80 కోట్లతో చేపట్టి పనులు మొదలు పెట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా పురోగతి పడకేసింది. వేదవతి ప్రాజెక్టు పనులు 6 శాతమే జరిగాయి.
- గాజులదిన్నె జలాశయం సామర్థ్యం 4.5 టీఎంసీలు నుంచి 5.50 టీఎంసీలకు పెంచాలనే ఉద్దేశంతో గత వైసీపీ ప్రభుత్వంలో రూ.35 కోట్లతో పనులు చేపట్టారు. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు.
- హంద్రీనీవా ప్రాజెక్టు పత్తికొండ (పందికోన) జలాశయం కుడి, ఎడమ కాలువలు, పంటల కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 61,394 ఎకరాలకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. అసంపూర్తి పనులకు రూ.202 కోట్లు ఇవ్వాలి.
- హంద్రీనీవా నుంచి 68 చెరువులను నింపే ఎత్తిపోతల, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులు ఇవ్వాలి.
- అలగనూరు జలాశయం 2.96 టీఎంసీలు సామర్థ్యం. మట్టి ఆనకట్ట కుంగిపోయి ఐదేళ్లు దాటింది. రూ.26.33 కోట్లు నిధులు మరమ్మతులు చేపట్టాలి.

- కేసీ కెనాల్ కింద ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు, కర్నూలు నగరానికి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం 20 టీఎంసీల సామర్థ్యంలో తుంగభద్రపై గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం రూ.2,980 కోట్లు మంజూరు చేస్తే.. అంతర్రాష్ట్ర సమస్య అని వైసీపీ హయాంలో పక్కన పడేశారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఆశలు చిగురిస్తున్నాయి.

పేదలకు టిడ్కో యోగం ఎప్పుడో?

ఉమ్మడి జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వం ఏపీ టిడ్కో కింద 52,318 ఇళ్లు మంజూరు చేసింది. వైసీపీ హయాంలో 21,038 ఇళ్లను రద్దుచేశారు. 31,289 ఇళ్లలో 23,645 ఇళ్లలో మెజార్టీ ఇళ్లు వంద శాతం పూర్తవ్వగా.. కొన్ని టీడీపీ ప్రభుత్వంలో 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. వైసీపీ హయాంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. 23,645 ఇళ్లకు గానూ 7,007 ఇళ్ల లబ్ధిదారులకు తాళాలు అప్పగించారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో నేటికీ 150-200 లబ్దిదారులు కూడా నివాసం లేరు. కర్నూలు జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులో 16,595 ఇళ్లు, నంద్యాల జిల్లాలో నంద్యాల, డోన్, ఆళ్లగడ్డలో 7,050 ఇళ్లు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయి. మౌలిక వసతులు కల్పించి పేదలకు అప్పగించాల్సిన అవసరం ఉంది.

వీటిపై దృష్టి సారించాలి

- కర్నూలు సర్వజన వైద్యశాలతో పాటు మెడికల్ కళాశాలల భవన నిర్మాణాలు రూ.450 కోట్లతో, ఆదోని మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణాలు రూ.480 కోట్లతో చేపట్టారు. వివిధ దశల్లో ఆ నిర్మాణాలు ఆపేశారు. వీటిని పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు మెరుగు పరచాలి.
- రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల 192 ఎకరాల్లో జగన్నాథగట్టుపై నిర్మాణం చేపట్టారు. రూసా నిధులు రూ.20 కోట్లు ఇచ్చారు. పునాదులతో పనులు ఆగిపోయాయి.
- డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వావిద్యాలయం శాశ్వత భవనాలు ఓర్వకల్లు విమానాశ్రయం పక్కనే 144.92 ఎకరాల విస్తీర్ణంలో ఫేజ్-1 కింద రూ.18 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వంలో చేపడితే వైసీపీ హయాంలో ఆపేశారు.
- జగన్నాథగట్టుపై 52 ఎకరాల్లో రూ.80 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన 'క్లస్టర్ యూనివర్సిటీ' పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి.
- ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత పక్కా భవనాలు నిర్మాణం, కోడుమూరు పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ హామీలు అమలు చేయాలి.
- కర్నూలు స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీ. అవసరమైన నిధులు మంజూరు చేసి ఆ దిశగా పనులు చేపట్టాలి.

తారస్థాయికి కూటమిలో కుమ్ములాటలు

రాష్ట్రంలో కూటమి పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ అధిష్టానం మధ్య సఖ్యత, సమన్వయం ఉంది. కానీ నియోజకవర్గాల్లో సమన్వయం కొరవడడంతో కూటమి పార్టీ నాయకుల మధ్య కుమ్ములాటలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆదోని నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుల మధ్య సమన్వయంలోపం టీడీపీ కార్యకర్తలకు తీవ్ర నష్టం చేకూర్చుతుంది. ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ఇద్దరి మధ్య సయోధ్య కుదిరిందని, అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో టీడీపీకి 60 శాతం, జనసేన, బీజేపీకి 40 శాతం అందేలా ఒప్పుకున్నారని కార్యకర్తల సమక్షంలో చెప్పారు. నెలలు గడుస్తున్నా ఆ ఒప్పందం అమలు కావడం లేదు. వైసీపీ నుంచి బీజేపీలో చేరిన వారికే ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇస్తున్నారనే టీడీపీ ఆరోపణ. సమన్వయం చేయకపోతే ఆ నియోజకవర్గంలో టీడీపీ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఆలూ రు, మంత్రాలయం నియోజకవర్గాల్లో టీడీపీ వర్గాల్లో విభేదాలు పార్టీకి నష్టం చేకూర్చేలా మారాయి. మిగిలిన నియోజకవర్గాల్లో కూడా కూటమి పార్టీల మధ్య ఆశించిన స్థాయిలో సమన్వయం కనిపించడం లేదు. ప్రతిపక్షంలో ఐదేళ్లు టీడీపీ జెండా చేతపట్టి వైసీపీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన వారిని గుర్తించడం లేదని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మదనపడుతున్నారు. అధికారం వచ్చాక ఎమ్మెల్యేలు తమను పక్కన పెట్టి.. వైసీపీ నుంచి వచ్చిన వారికే పనులు, పదవులు ఇస్తున్నారని కార్యకర్తల ఆవేదన. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదని సీనియర్ నేతలే అంటున్నారు.



అసంపూర్తిగా ఆదోని మెడికల్ కాలేజీ భవనాలు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ఘనస్వాగతం

ఓర్వకల్లు, మే 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శుక్రవారం ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కలెక్టర్ రంజిత్ బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ ఘన స్వాగతం పలికారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక వాహనంలో కర్నూలులోని ఓకార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం అనంతపురానికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి మొక్కను ఇచ్చిన ఎమ్మెల్యే గౌరు చరిత

విజయవాడకు విమాన సౌకర్యాన్ని కల్పించండి

- కేంద్రమంత్రికి ఎంపీ బస్తిపాటి వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ నాగరాజు

కర్నూలు, మే 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి విజయవాడకు త్వరలో విమాన సర్వీసులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ఇదిలా ఉండగా వినతిపత్రం ఇచ్చిన కొన్ని గంటలకే రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ త్వరలోనే ఈ సర్వీసులు కొనసాగిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు ఎంపీ నాగరాజు ఆంధ్రజ్యోతికి వివరించారు. ఎన్నో ఏళ్ల కలగా ఉన్న విమానయాన సర్వీసులు ప్రారంభిస్తే అమరావతికి వెళ్లేందుకు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలి

- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహా యాదవ్

కల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయడంతో విఫలమైందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహా యాదవ్ విమర్శించారు. శుక్రవారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సామాజిక పింఛన్లు హామీలన్నీ అటకెక్కించారని ఆరోపించారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్, యువగళం కింద నిరుద్యోగులకు రూ.3వేల భృతి, 77 జీఓ రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను ఇంకెప్పుడు అమలు చేస్తారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చిన మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాల స్వామి, నాగలింగం, జనార్ధన్, ఉస్మాన్‌భాషా, రజాక్‌వలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు గ్రామ సమీపంలో విద్యుదాఘాతానికి గురై శ్రీనివాసులు (35) అనే వ్యక్తి మృతి చెందాడు. అలంపూరు మండలం సుల్తానాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు కర్నూలు కృష్ణానగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. ఈయన కిమ్స్ ఆసుపత్రి వైద్యుడు నారాయణరెడ్డి దగ్గర కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవరాం చిన్నటేకూరు సమీపంలోని నారాయణరెడ్డి తన సొంత పొలానికి డ్రైవర్‌తో పాటు వెళ్లాడు. గేటు అడ్డంగా విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో ఆ తీగలను తొలగించాలని సూచించాడు. ఆ తీగలను తొలగించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. ఆయనను వెంటనే చికిత్స నిమితం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా. ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. బంధువులు ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వే ప్లాట్‌ఫారంపై వ్యక్తి మృతి

నంద్యాల టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రైల్వే ప్లాట్‌ఫారంపై వీర్రాజు అనే వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. గురువారం రాత్రి రెండో ప్లాట్‌ఫారంపై మృతిచెందాడు. జేబులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించుకున్న ఓపీ ఉంది. అందులో వీర్రాజు పేరు తప్ప వివరాలేమీ లేవు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో ఉంచామని తెలిపారు.

ఒక్కటైన 75 జంటలు

- వివాహాలకు సహకరించిన మంత్రి టీజీ భరత్ కుటుంబ సభ్యులు



వివాహ వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

కర్నూలు కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ కుటుంబం ఆధ్వర్యంలో శుక్రవారం 75 జంటలు ఒక్కటయ్యాయి. టీజీ వెంకటేశ్ జన్మదినం సందర్భంగా మంత్రి కుటుంబ సభ్యులు శుక్రవారం వివాహాలు చేసుకున్న 75 జంటలకు రూ.80 వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఇప్పటికే వారికి మంగళసూత్రం, వధూవరులకు వస్త్రాలు తదితర సామగ్రిని అందజేశారు. దీంతో వివాహాలు చేసుకున్న జంటలను నగరంలోని మౌర్య ఇన్‌లోని పరిణయ ఫంక్షన్ హాలులో టీజీ వెంకటేశ్ దంపతులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెళ్లి చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న వారు ఎటువంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఆరోగ్యంగా ఉంటూ సంసారాన్ని చక్కదిద్దుకోవాలని సూచించారు. తన కుమారుడు మంత్రి టీజీ భరత్‌తో పాటూ కుటుంబ సభ్యుల సహకారం ఉన్నందునే తాను సేవా కార్యక్రమాలు నిర్వహించ గలుగుతున్నానని అన్నారు. మంత్రిగా టీజీ భరత్ కూడా ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో రాజకీయాల్లోకి వచ్చారని, మంత్రిగా కర్నూలు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమలు రాకుండా కొంతమంది అడ్డుపడుతున్నారని, వారి గురించి తెలుసుకుని అటువంటి వారికి దూరంగా ఉండాలని చెప్పారు.

మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు ప్రజలకు ఏదో ఒక మంచిపని చేయాలని తన తండ్రి టీజీ వెంకటేశ్ ఆలోచిస్తుంటారని అన్నారు. 25 ఏళ్లుగా కులమతాలకు అతీతంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాము పెళ్లిళ్లు చేసిన జంటలన్నీ సంతోషంగా ఉండటం తమకు గర్వంగా ఉందన్నారు. తనకు తండ్రే రోల్ మోడల్ అని, ఆయనను స్ఫూర్తిగా తీసుకునే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. పెట్టుబడులు తీసుకువచ్చే విషయంలో రాష్ట్రాల మధ్య ఎంతో పోటీ నెలకొందని అన్నారు. తమ ఫ్యాక్టరీ విస్తరణ చేసే విషయంలో ఇలాంటి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి, మంత్రి భరత్ సతీమణి టీజీ శిల్పాభరత్, టీజీ కుటుంబ సభ్యులు సునీల్, కృష్ణజ్యోత్స్న, రవిరాజ్, మౌర్య తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

తాగునీటి సరఫరాలో అంతరాయం

నంద్యాల టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని టెక్కె రోడ్డు వద్ద ఎస్బీఐ కాలనీ జంక్షన్ వద్ద ఉన్న అమృత్ పంపింగ్ పైపులైన్ లీకేజీ ఉండడంతో మరమ్మతులు పనులు శుక్రవారం రోజున ప్రారంభించినట్లు పురపాలక కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 12 గంటల నుంచి నీటి సరఫరాను ఆపివేశారు. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగనుంది. ఎస్బీఐ కాలనీ, విశ్వనగర్, హౌసింగ్‌బోర్డు, లలితా నగర్, దేవనగర్, రైల్వే స్టేషన్ రోడ్డు, గిరినాథ్ సెంటర్, రెవెన్యూ క్వాటర్స్, గోపాల్ నగర్, వీసీ కాలనీ, ఇస్లాం పేట, బలిజపేట, సాదిక్ నగర్, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, బొమ్మలసత్రం, బైటీపేట, పెద్ద చర్చి ఏరియా, మిషన్ కంపౌండు ఏరియా ఇలా పలు ఏరియాల్లో నీటి సరాఫరా 12 గ ంటల నుంచి నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు గమనించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఆత్మకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైర్లూటిలో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల బాలికల పాఠశాల అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ రేఖామణి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ పాఠశాలలో 3 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి సంబంధించి బా లికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రత్యేకించి మూడో తరగతి ప్రవేశానికి సంబం ధించి ఎస్టీ విభాగానికి 31సీట్లు, ఎస్సీ విభాగానికి 5 సీట్లు, బీసీ విభాగానికి 2 సీట్లు, ఓసీ విభాగానికి 1, ఈడబ్ల్యుఎస్ విభాగానికి 1 సీటు ఉన్నట్లు చెప్పారు. నాల్గో తరగ తిలో 30సీట్లు, ఐదో తరగతిలో 32సీట్లు, ఆరో తరగతిలో 21సీట్లు, ఏడో తరగతిలో 19సీట్లు, 8వ తరగతిలో 18సీట్లు, 9వ తరగతిలో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలి పారు. అర్హులైన విద్యార్థినులు సంబంధిత ధృవీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మూడో తరగతి ప్రవేశాలను ఆయా కేటగిరిల ప్రకారం ఎంపిక చేస్తారన్నారు. మిగతా తరగతుల్లో అన్నిసీట్లను ఎస్టీలకు మాత్రమే కేటాయిం చినట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 9492942873, 9985246102, 6301565831 సంప్రదించాలని కోరారు.

పాణ్యం: బస్టాండు సమీపంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతిలో రిజర్వేషన్ అనుసరించి నియమ నిబంధనల ప్రకారం అన్నివర్గాల వారికి, 4వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఉన్న ఖాళీలను బ్లాక్‌లాగ్ కింద ఎస్టీ విద్యార్థులకు మాత్రమే నింపబడునని వివరించారు. 3వతరగతిలో ఎస్టీలకు 31, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీలకు 1కేటాయించినట్లు సూచించారు. 4వతరగతికి 27 సీట్లు, 5వతరగతికి 20, 6వ తరగతికి 15, 7వతరగతికి 6 సీట్లు, 8వతరగతికి 4 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. 4 నుంచి 8వతరగతి వరకు ఎస్టీ విద్యార్థులకు మాత్రమే కేటాయిం చామని, వివరాలకు 9959758919, 8333000229, 9398319895 నంబర్లను సంప్రదించాలని కోరారు.

'సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి'

పగిడ్యాల, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోని సమస్య లను పరిష్కరించాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై లబ్ధిదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. పలువురు అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు గ్రామాల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● గృహాలు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు చేసే ఇంటి పట్టాలు (ప్రొహిజన్ పత్రాలు) లలో జాప్యం జరుగితే సహించేది లేదని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. పగిడ్యాలలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో లబ్ధిదారులు ఇంటి పట్టాల మంజూరులో ఆలస్యం జరుగుతుందని ఫిర్యాదుపై ఎమ్మెల్యే స్పందించారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

బండిఆత్మకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): రైతులు కచ్చితంగా తమ పొలాలకు సంభందించి భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏవో స్వాతి సూచించారు. శుక్రవారం బండిఆత్మకూరులో కౌలు రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఇతర రైతుల నుంచి భూములు కౌలుకు తీసుకన్న వారు విధిగా కౌలు కార్డులు పొందాలన్నారు. తద్వార ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుకోవాలని ఆమె సూచించారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

గడివేముల, మే 16 (ఆంధ్రజ్యోతి): కిషోరి వికాసం బాలికల బం గారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, బాలికలు అన్ని రంగాల్లో రాణిం చాలని జిల్లా మహిళా శిశు అభివృద్ధి అధికారి లీలావతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కిషోర వికాసం సమ్మర్ స్పెషల్ కార్యక్రమానికి హాజరయ్యారు. కుట్లు, అల్లికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కిషోర బాలికలకు ప్రశంసా పత్రం అందజేశారు. సీడీపీవో చంద్రకళ, ఏసీడీపీవో పద్మావతి, ఎంపీడీవో వాసుదేవగుప్త, సూపర్‌వైజర్ కళావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

వెలుగోడు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు తమ సంపాదనలో కొంత బాగాన్ని నిరుపేదలకు వెచ్చించి సేవాగుణం అలవర్చుకోవాలని నంద్యాల యూత్ కో ఆర్డినేటర్ సురేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వెలుగోడు పట్టణంలో చెంచుకాలనీలో చెంచులకు ఉచితంగా వాటర్ బాటిళ్ళను పంపిణీ చేశారు. కళింగ యూనివర్సిటీ చైర్మైన్ అచ్యుత సమంత ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నాగేశ్వరరావు, మధుగౌడు తదితరులు పాల్గొన్నారు

సారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని నీలిషికారి కాలనీలో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ, పోలీసుశాఖలతో కలిసి ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ సుభాషిణి, ఎస్ఐ మారుతి ఆధ్వర్యంలో మూకుమ్మడి దాడులు నిర్వహించారు. 3,180 లీటర్ల నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 35 లీటర్ల నాటుసారా సీజ్ చేసి, నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. అనంతరం నీలిషికారి కాలనీ వాసులకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు నాటుసారా తయారు చేయము అని నీలిషికారి కాలనీ వాసులతో ప్రమాణం చేయించారు. కర్నూలు ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ కృష్ణ, మధుసూదన్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ రమేష్‌బాబు, నందికొట్కూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ రామాంజ నేయులు, ఎస్ఐ జఫ్రూల్లా, ఆళ్లగడ్డ సీఐ విజయకుమార్, కోవెలకుట్ల ఎస్ఐ సందీప్, ఆత్మకూరు ఎస్ఐ జగదీష్, నందికొట్కూరు అర్బన్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బండిఆత్మకూరు మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కలీలకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు డేవిడ్ కోరారు. శుక్రవారం మండలంలోని ఏ కోడూరు, శింగవరం గ్రామాల్లో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు రత్నమయ్య పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

● మున్సిపల్ అధికారులకు సీడీఎంఏ సంపత్‌కుమార్ హెచ్చరిక




మాట్లాడుతున్న సీడీఎంఏ సంపత్‌కుమార్, పాల్గొన్న మున్సిపల్ అధికారులు

నంద్యాల టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడినా, విధుల్లో నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపాలిటీ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) సంపత్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం నంద్యాల పురపాలక కార్యాలయంలోని భవనంలో పురపాలక జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.వెయ్యి కోట్లు పన్నులు వసూళ్లు చేయాలని టార్గెట్ ఉంటే రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాల్లో 80 శాతం పూర్తి చేస్తే నంద్యాలల్లో మాత్రం కేవలం 60 శాతం పూర్తి చేయడం ఏమిటని కమిషనర్ నిరంజన్‌రెడ్డిని ప్రశ్నించారు. నంద్యాల పురపాలక సంఘం నుంచి ఎక్కువగా కాంట్రాక్టు వాహనాలు అడుగుతున్నారని, బిల్లులు ఎందుకు ఎక్కువగా వస్తున్నాయని ప్రశ్నించారు. ఇదిలా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. చెత్త సేకరణ నిబంధనలు విరుద్ధంగా ఉందన్నారు. నంద్యాల మున్సిపల్ కమిషనర్‌ను మురుగు కాలువల పరిస్థితి ఎలా ఉందని అడగగా నంద్యాల బాగుందని చెప్పారు. వెంటనే సీడీఎంఏ స్పందిస్తూ కలెక్టరేట్ వద్ద మురుగు కాలువ చాలా అధ్వానంగా ఉందని అన్నారు. పన్నులు వసూలు చేయడంలో కానీ, పురపాలక సంఘానికి ఆదాయం వచ్చే మార్గాలను నిర్లక్ష్యం చేయకుండా డబ్బులు వృథా చేయకుండా అనవసరంగా బిల్లులు, కంట్రాక్టులు ఇచ్చి చేయకుండా డబ్బులు సేవ్ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు వంటి పురపాలక సంఘాల్లో పని తీరు కూడా చుస్తున్నానని, వారు కూడా పనీ తీరు మార్చుకోవాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల్లోని మేజర్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండకాలం అయిపోతున్న ఇంకా నీటి సమస్యలు ఉన్నాయని వాటిలో ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని అడిగి వాటి రిపోర్టు తప్పనిసరిగా పంపించాలని చెప్పారు. పురపాలక సంఘాల్లో క్షేత్ర స్థాయిలో పని తీరు బాగాలేదని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. నంద్యాల కమిషనర్ నిరంజన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, ఎంఈ గురప్ప, ఆర్వో వెంకటరెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో



నంద్యాలలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు

నంద్యాల హాస్పిటల్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీతో అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ఆర్.వెంకటరమణ సూచించారు. నంద్యాలలో జాతీయ డెంగీ నివారణ దినాన్ని పురస్కరించుకొని శుక్రవారం వైద్యాధికారులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నంద్యాల డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ప్రారంభమై సాయిబాబానగర్ ఆర్చి వరకు చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పగలు కుట్టే దోమలు అత్యంత ప్రమాద కరమని, దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మలేరియా అధికారి రామేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేను పాటిస్తే డెంగీ దోమ ఉత్పత్తిని అరికట్టవచ్చన్నారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు అంకిరెడ్డి, సుదర్శన్ బాబు, కాంతరావునాయక్, సహాయ మలేరియా అధికారి రామవిజయ రెడ్డి, నంద్యాల సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, మలేరియా కార్యాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

మహానంది: ఎం.తిమ్మాపురంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేణు కార్తికేయ ఆధ్వర్యంలో డెంగీ నివారణ దినం సందర్భంగా సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్ఈవో ఉసేన్‌రెడ్డి, పీహెచ్ఎన్ ఆమీనాబాయ్, సిబ్బంది చంద్రహారికర్, భార్గవి, అరుణ, స్వరూప పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: బైర్లూటి గూడెంలో బైర్లూటి పీహెచ్‌సి వైద్య బృందం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి పవన్‌కుమార్, స్టాఫ్ నర్స్ షఫీవున్నీసా, ల్యాబ్ టెక్నిషియన్ సోమేశ్వరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల సేవలను స్మరించుకోవాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

పగిడ్యాల, మే 16 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన సైనికుల సేవలు మరువలేనివని, వారిని స్మరించుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం విజయం సాధించడంతో పగిడ్యాల బస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆధ్వర్యంలో తిరంగ యాత్ర కార్యక్రమంలో బాగంగా మండల అధికారులు, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు 500 మీటర్ల బారీ జాతీయ జెండాతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వీధుల గుండా భారత్ మాతాకు జై, అమరులైన జవాన్లకు జోహరులు అంటూ నినాదాలు చేశారు. అనతరం అమరులైన జవాన్ల ఆత్మకు శాతి చేకూరాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుమిత్రమ్మ, తహసీల్దార్ మధుబాబు, ఎంఈవో సుభాన్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఓర్వకల్లు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్.కొట్టాల బస్ స్టేజీ సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మిడ్తూరు మండలం చింతలపల్లె గ్రామానికి చెందిన బోయ చరణ్ (16) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. ముని రంగస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురు గ్రామంలో దేవర ఉన్న సందర్భంగా ఓర్వకల్లు మండలంలోని బ్రాహ్మణపల్లెలో బంధువులకు చెప్పి హెచ్.కొట్టాలకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. కొట్టాల బస్ స్టేజీ వద్ద తిరుపతి నుంచి హైదరాబాదు వెళ్లే లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో బోయ చరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రీసర్వే గ్రౌండ్ ట్రూథింగ్ తనిఖీ

జూపాడుబంగ్లా, మే 16 (ఆంధ్రజ్యోతి): మండ్లెం గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనులను జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కృష్ణకుమార్ తనిఖీ చేశారు. సర్వే జరుగుతున్న పొలాలను పరిశీలించి సర్వే టీం కచ్చితంగా ఎఫ్ఎంబీ, గ్రామ అడంగల్‌తోపాటు 45 సంఖ్యల స్టేట్‌మెంట్‌ను రైతులతో కలిసి వివరాలను పూర్తి చేయాలని సూచించారు. విస్తీర్ణంలో తక్కువ, ఎక్కువ కొలతలు ఉన్నప్పుటు రైతుల హక్కుపత్రాలను పరిశీలించాలని సూచించారు. ప్రతిరోజు 35 ఎకరాలను రీసర్వేచేయాలని, ఈ సర్వేను జూన్ 6లోపు పూర్తి చేయాలని సర్వే బృందాలకు ఆదేశించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ నాగన్న, మండల సర్వేయర్ అతీఫ్, వీఆర్వోలు, సర్వేసిబ్బంది పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

ఆత్మకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ఎంఎం గార్డెన్‌లో ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి శ్రీశైలం నియోజకవర్గ మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నేతృత్వంలో జరగనున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులతో పాటు కేఎస్ఎస్ సభ్యులు, క్షేత్ర స్థాయి కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరవుతారని పార్టీ శ్రేణులు శుక్రవారం వెల్లడించారు.

తిరంగా ర్యాలీ

పాకిస్థాన్‌పై భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో భారత త్రివిధ దళాలకు కృతజ్ఞతలు తెలియజేందుకు గాను ఈ నెల 19వ తేదిన ఆత్మకూరు పట్టణంలో తిరంగ ర్యాలీ నిర్వహించనున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేది ఉదయం 9గంటలకు స్థానిక నంద్యాల టర్నింగ్ నుంచి గౌడ్ సెంటర్ వరకు తిరంగ ర్యాలీ జరపనున్నారు. ఈ ర్యాలీలో సైనిక కుటుంబాల సభ్యులు, విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, అధికారులు, ఎన్డీఏ కూటమి ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని టీడీపీ కార్యాలయం తరుపున శుక్రవారం కోరారు.

వీరజవాన్‌కు ఘన నివాళి



మురళీనాయక్‌కు నివాళి అర్పిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

పాణ్యం, మే 16 (ఆంధ్రజ్యోతి): పహల్గాం దాడి సంఘటనలో ఉగ్రవాదుల తూటాలకు బలైన వీరజవాన్ మురళీనాయక్‌కు వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శుక్రవారం నివాళి అర్పించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు సిమెంట్ శీను, వీహెచ్‌పీ నాయకులు శంకరయ్య, సుబ్బరాయుడు, ఎల్లప్ప, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.


కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

జూపాడుబంగ్లా, మే 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో కౌలుకు తీసుకున్న రైతు తప్పనిసరిగా కౌలుకార్డుకోసం దరఖాస్తు చేసుకుని కార్డులు తీసుకోవాలని ఏవో కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని తరిగోపుల గ్రామంలో శుక్రవారం కౌలుకార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలుకార్డు వల్ల ఎక్కువ ప్రయోజనాలు పొంద వచ్చని అన్నారు. ప్రభుత్వం అందించే సుఖీభవ, పంటలబీమా, పంట నష్ట పరిహారం, పంట రుణాలు పొందవచ్చని అన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

పాణ్యం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం పాణ్యంలో ఎయిడ్స్ నివారణపై కళాజాతా నిర్వహించారు. జిల్లాలో 20 చోట్ల ఎయిడ్స్ నివారణ కళాజాతా ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజరు వెంకటరత్నం తెలిపారు. వీఎంఎం సంస్థ ప్రాజెక్టు మేనేజరు వెంకటసుబ్బయ్య, సిబ్బంది ఐసీడీఎస్, స్వయం సహాయక సంఘాలు పాల్గొన్నాయి.

అలగనూరు రిజర్వాయర్‌లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



మిడుతూరు మండలంలోని అలగనూరు రిజర్వాయర్‌లో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యం

నందికొట్కూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండలంలోని అలగనూరు రిజర్వాయర్‌లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. వైసీపీ హయాంలో బండ్ కుంగడంతో రిజర్వాయర్ మొత్తం ఒట్టి కుండను తలపిస్తోంది. దీంతో సారవంతమైన మట్టిని తమ పొలాలకు తరలించేందుకు ఎక్స్‌కవేటర్లు ట్రాక్టర్‌లతో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. నల్లమట్టిని కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వుతున్నారు. గ్రూపులుగా ఏర్పడి పలు చోట్ల ఎక్స్‌కవేటర్ల సాయంతో మట్టి తవ్వకాలు చేపట్టి అధిక సంఖ్యలో ట్రాక్టర్ల ద్వార తరలిస్తున్నారు. రిజర్వాయర్‌కు గండి పడి నాలుగేళ్ల నుంచి అధికారులు నీటి నిల్వలు చేపట్టలేదు. రిజర్వాయర్‌లో చుక్కనీరు లేకపోవడంతో ఇదే అదునుగా కొందరు అనుమతులు లేకుండా మట్టిని తవ్వుకొని తరలిస్తున్నారు. అలగనూరు రిజర్వాయర్ ఈఈ ప్రతాప్‌ను వివరణ కోరగా మట్టిని తవ్వేందుకు ఎలాంటి అనుమతులు లేవని ఆయన తెలిపారు.

కుంభాభిషేకానికి మంత్రి బీసీకి ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈవో

పాణ్యం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి 21 వతేదీ వరకు కొత్తూరులో జరిగే కుంభాభిషేకానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని దేవదాయశాఖ అధికారులు ఆహ్వానించారు. శుక్రవారం బనగానపల్లెలోని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గృహంలో దేవదాయశాఖ జిల్లా అధికారి మోహన్, కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ ఈవో రామకృష్ణ కుంభాభిషేకం, రాజగోపుర కలశ ప్రతిష్ఠకు ఆహ్వానిస్తూ పత్రికను అందజేశారు. మంత్రిని పూలమాలలతో, శేష వస్త్రాలతో బీసీ దంపతులను సత్కరించారు. అనంతరం స్వామివారి చిత్ర పటం, తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకులు సురేష్‌శర్మ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వేధిస్తున్న సర్వర్ సమస్య



మందకొడిగా సాగుతున్న ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ

ఆత్మకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ కార్డు సేవలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పోర్టల్‌కు సర్వర్ సమస్య వేధిస్తోంది. ఈ 7వ తేది నుంచి కొత్త రేషన్ కార్డులతో పాటు రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యులు జోడింపు, తొలగింపు, అడ్రస్ మార్పు, ఆధార్ నంబర్ సీడింగ్ తదితర సేవలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవకాశం కల్పించారు. అయితే ఎన్నో నెలల తర్వాత ఈ ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చిచేరుతున్నాయి. దీంతో ఆన్‌లైన్ పోర్టల్‌లో సర్వర్ సమస్య సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇందులో ఒక సభ్యుడి వేలిముద్రలు సేకరించి ఆన్‌లైన్ యాడ్ చేసినట్లయితే ఆటోమెటిక్‌గా ఆ రేషన్ కార్డులోని మరొక సభ్యుడి పేరు డీయాక్టివేట్ అవుతోంది. దీంతో మళ్లీ పలుమార్లు ప్రయత్నించి ఆపేరును యాడ్ చేయాల్సి వస్తోంది. అదేక్రమంలో నిర్దేశించిన సైట్ సర్వర్ కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో సంబంధిత సచివాలయ, వీఆర్వోలు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే డీఎస్సీ నోటిఫికేషన్, ఇతర అవసరాల నిమిత్తం ఆత్మకూరు పట్టణంలోని 13 సచివాలయాల్లో సిబ్బంది సెలవుల్లో వెళ్లడంతో ప్రస్తుతం విధుల్లో ఉన్న వారు మరింత అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్ పోర్టల్‌లో సర్వర్ సమస్య లేకుండా చూడాలని రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

శ్రీశైలంలో ఊయల సేవ

శ్రీశైలం, మే 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకళ్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహా గణపతి పూజ చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం హైదరాబాదుకు చెందిన ఉదయశ్రీ నాట్య అకాడమీతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

మహానందిలో పల్లకీ ఉత్సవం

మహానంది, మే 16 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీ ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి, అమ్మవారి ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో ఆశీనులు గావించారు. వేదమంత్రాలతో పూజలు జరిపారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కొలను భారతి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో సరస్వతిదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చన పూజాది క్రతువులు నిర్వహించి మహా మంగళహారతులు ఇచ్చారు. భక్తులు వారి చిన్నారులకు కుటుంబ సమే తంగా ఆలయ పురోహితులు శ్రీనివాస శర్మ బీజాక్షర క్రతువులు చేయించారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

నంద్యాల కల్చరల్, మే 16(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఆదివారం మూడు రంగల జాతీయ జెండాలతో తిరంగా యాత్రను నిర్వహిసున్నామని, విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపునిచ్చారు. ఈ యాత్ర ఆదివారం ఉదయం 8గంటలకు టెక్కె మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమై గాంధీచౌక్ వరకు ఉంటుందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు ర్యాలీలో పాల్గనాలని కోరారు. 'ఆపరేషన్ సిందూర్' వీరోచితంగా పోరాడిన వారికి మద్దతుగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మెగా జాబ్ మేళా

నంద్యాల ఎడ్యుకేషన్, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జాన్సన్ గ్రూప్, పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయ వంతంగా ముగిసింది. దిశ డాన్‌బోస్కో సహకారంతో ఈ జాబ్‌మేళాను జాన్సన్ గ్రూప్ ప్రతినిధి ఫాదర్ జాన్‌దేవదాస్ పర్యవేక్షణలో నిర్వహిం చారు. ఈ జాబ్‌మేళాలో దాదాపు 1500 మంది నిరుద్యోగులు పాల్గొ న్నారు. 24 కంపెనీలకు చెందిన ప్రతినిధులు జాబ్‌మేళాలో నిరుద్యోగ యువతీ, యువకులను ఎంపికచేసుకొని వారికి నియామక పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, ఫాదర్ జార్జ్, ఫాదర్ రాజీవ్, దిశ డాన్‌బోస్కో రాయలసీమ ప్రతినిధులు పాల్గొన్నారు.

'తంగడంచ భూములు సోలార్ ప్రాజెక్టుకు ఇస్తే పోరాటం'

జూపాడుబంగ్లా, మే 16 (ఆంధ్రజ్యోతి): తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలోని భూములను గతంలో ఏపీఐఐసీకి కేటాయించి ప్రస్తుతం మళ్లీ ఆభూముల్లో సోలార్‌కు కేటాయించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, సోలార్‌కు కేటాయిస్తే సీపీఐ పోరాటం చేపడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం గతంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములను సీపీఐ బృందం పరిశీలించింది. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జైన్‌పరిశ్రమ, మెగాసీడ్ పార్కులకు భూములు కేటాయించడమేకాకుండా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం మారడంతో ఈ పరిశ్రమలపై నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నారని, మెగాసీడ్‌పార్కును ఏర్పాటు చేయాలని, జైన్‌పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. సోలార్‌ను మెట్టప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని, సారవంతమైన తంగడంచలో ఏర్పాటు చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు డిమాండుతో కూడిన వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు సోమన్న, రఘురామమూర్తి, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం



వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ ఉత్సవమూర్తుల ఊరేగింపు

చాగలమర్రి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం వైభవంగా వసంతోత్సవం, హంసవాహనోత్సవం వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ సమీపంలోని కుందూనదిలో క్షీరాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు రంగులు చల్లుకుంటూ చెన్నకేశవ ఉత్సవ మూర్తుల పల్లకి ఉత్సవం చేశారు. పల్లకితో గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటరమణ, ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, సుబ్బిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

డోన్ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్ కే.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కొత్తబురుజు గ్రామంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా డెంగీ నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శిరివెళ్ల: దోమలను నివారించడం ద్వారా డెంగీ వ్యాధిని నియంత్రించొచ్చని వైద్యుడు ముఖేష్ అన్నారు. శిరివెళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డెంగీ, మలేరియా ఆరోగ్య కార్యకర్త చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామాల్లో ప్రజలు డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు అంజలి సూచించారు. శుక్రవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో జాతీయ డెంగీ దినోత్సవంపై ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల ఆరోగ్య సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ వైద్యశాలలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీ సీడీ సర్వే వేగవంతం చేయాలన్నారు. సర్వేకు కావాల్సిన మెటీరియల్‌ను కూడా పంపిణీ చేశారు. గర్భిణులను సకాలంలో గుర్తించి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసి వారికి ఎంసీపీ కార్డును అందించాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని అన్నారు. సమావేశంలో వైద్యులు అంజలి, సీహెచ్‌వో రమణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

చాగలమర్రి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సైతం పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించి మమ అనిపించారు. అంతకముందు ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి, యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ముల్లా రఫీ, ఆశీర్వాదమ్మ, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంఈవో న్యామ తుల్ల, పశువైద్యాధికారులు సాయిబాబా, దీపకుమారి, ఏవో రంగనేతాజీ, అధికారులు కొండారెడ్డి, జగ్గయ్య, రమణయ్య, నరసింహరావు, నాగేశ్వర్‌రెడ్డి, ఖాసీం, సుశీల, నాగమ్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి పూజలు

రుద్రవరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలో కొలువుదీరిన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆర్యవైశ్యులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.


పశువులకు గొంతువాపు టీకాలు వేయించండి

రుద్రవరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గొంతు వాపు టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండమాయపల్లె గ్రామంలో పశువులకు గొంతువాపు వ్యాధి టీకాలు వేశామన్నారు. వర్షాలు కురుస్తున్నం దున పొలాల్లో గడ్డి మొలకలు తింటే పశువుల్లో గొంతువాపు వ్యాధి వస్తుందన్నారు. ప్రతి రైతు స్పందించి తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

కౌలు గుర్తింపు కార్డులు తప్పనిసరి

దొర్నిపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని భూమి లేని కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా పొందాలని కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చాకరాజువేముల గ్రామంలో ఏవో ప్రమీల ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు రైతులు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో వీఆర్వోలను సంప్రదించి కౌలు గుర్తింపు కార్డులు పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఏవో ప్రమీల, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



డోన్‌లో బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్యాపిలి/డోన్‌టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన స్థానిక జడ్పీటీసీ మెంబరు బోరెడ్డి శ్రీరామిరెడ్డి కుటుంబాన్ని, డోన్‌లో గుండెకు సంబంధించిన సర్జరీ చేయించుకున్న వేణుగోపాల్‌ను ఆయన పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, వైసీపీ నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, రాజా మురళి, బోరెడ్డి రాము, రజనిరెడ్డి, క్రిష్టారెడ్డి, సోమశేఖర్, శ్రీరాములు, కురుకుందు హరి, మల్లికార్జున రెడ్డి, సోమేష్ యాదవ్, రామచంద్రుడు, తదితరులున్నారు.

నేడు బుగ్గానిపల్లెలో గ్రామసభ

బేతంచెర్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల నగరపంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో శనివారం ఉదయం 10:30 గంటలకు గ్రామ సభ నిర్వహించనున్నట్లు రీ సర్వే డీటీ మహేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో భూముల కొలతలు వేయడం పూర్తిగా అయిపోయిందని పేర్కొన్నారు. రైతులు భూమి విస్తీర్ణం చూసుకుని 9(2) నోటీసును సంతకం చేసి తీసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

గడ్డుకాలమే

- అరకొర దిగుబడులు
- నామమాత్రపు ధరలు
- అకాల వర్షాలతో ఇబ్బందులు
- విలవిలలాడుతున్న మామిడి రైతులు



ప్యాపిలి, మే 16 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయలు ఎక్కువగా వచ్చేది ఏప్రిల్, మే నెలలు. ఈయేడు మే నెల మామిడి రైతులకు గడ్డుకాలమే అని చెప్పవచ్చు. పంట దిగుబడులు అంతంత మాత్రమే ఉండగా ధరలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. మండలంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ప్యాపిలి, పోతుదొడ్డి, కలచట్ల, ఎర్రగుంట్లపల్లి, వెంగళాంపల్లి, ఏనుగమర్రి, మాందొడ్డి, గుడిపాడు గ్రామాల్లో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. రూ. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి రైతులు తోటలను కాపాడుకున్నారు. కాయలు ఆశాజనకంగా రావడంతో మంచి లాభాలు వస్తాయని రైతులు ఆశ పడ్డారు. అయితే అకాల వర్షాలు, పతనమైన ధరలు రైతుల ఆశలను అడియాశలు చేశాయి.

ఐదెకరాల్లో మామిడి సాగు చేశా



ఐదెకరాల్లో మామిడి తోటను సాగు చేశా. కాపు ఆశాజనకంగా వచ్చింది. దీంతో మంచి లాభాల వస్తాయని సంబర పడ్డా. అకాల వర్షాలతో తోట దెబ్బ తిన్నది. అరకొరగా మిగిలిన కాయలకు కూడా మార్కెట్లో ధరలు లేవు. ప్రస్తుతం మార్కెట్లో మామిడి రూ.25వేలకు మించి పలకడం లేదు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.

● వెంకటరాముడు, రైతు, ప్యాపిలి

నట్టేట ముంచాయి

ప్రకృతి వైపరీత్యాలు రైతులను నట్టేట ముంచాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, పెనుగాలులకు మామిడి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు గ్రామాల్లో చేతికొచ్చిన కాయలు నేల రాలాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో మామిడి రైతు కన్నీరు మున్నీరయ్యాడు.

నానాటికీ ధరలు పతనం

మామిడి ధరలు నానాటికీ పతనమవుతున్నాయి. నెల రోజుల క్రితం టన్ను రూ.60వేల నుంచి రూ.70వేలు పలికాయి. 20 రోజుల నుంచి రోజురోజుకు ధరలు పడిపోతున్నాయి. వారం రోజుల కిందట రూ.50వేలు పలికిన ధరలు ప్రస్తుతం టన్ను రూ.20వేలు నుంచి రూ.30వేలకు మించి పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుత ధరలు రవాణా ఖర్చులకు కూడా సరిపోవడం లేదని వారు వాపోతున్నారు.

వైభవంగా చెన్నకేశవుడి తిరు రథోత్సవం



చెన్నకేశవస్వామి తిరు రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అవుకు, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వెలసిన భూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరు రథోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మండపం వీధిలో రాత్రి నిద్రించిన ఉత్సవమూర్తులకు ఉదయం అర్చకులు పూజలు చేశారు. సాయంత్రం స్వాముల వారిని పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి పూజలు చేసి తిరు రథోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. చెక్కభజన కోలాటలు, భక్తుల ఆనందోత్సవాల మధ్య స్వామి వారి రథం అమ్మవారిశాల వీధి, రాజవీధి మీదుగా తేరు వీధికి చేర్చారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. శనివారం నిర్వహించే తీర్థవాది, ధ్వజారోహణం, వసంతోత్సవం, కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. సీఐ మంజునాథరెడ్డి, ఎస్‌ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో వీరయ్య, టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి, టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్, టీడీపీ నాయకులు బత్తిన మద్దిలేటిగౌడు, తిక్కన్న, దంతెల రమణ, అరుణ్ కుమార్‌నాయక్, వెంకటరాముడునాయక్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన బండలాగుడు పోటీలు

పట్టణంలో భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన బండలాగుడు పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను టీడీపీ మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్, బత్తిన మద్దిలేటిగౌడు కలిసి ప్రారంభించారు. పోటీల్లో ఏడుజతల వృషభాలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ. లక్ష నంద్యాల జిల్లా డోన్ మండలం ధర్మవరం సుబ్బారెడ్డికి చెందిన వృషభాలు గెలుపొందాయి. రెండో బహుమతి రూ. 80వేలు అనంతపురం జిల్లా గార్లదిన్నె గ్రామానికి చెందిన రామాంజనేయులు వృషభాలు, మూడవ బహుమతి రూ.60వేలు నంద్యాల జిల్లా గుంపరమనుదిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి వృషభాలు, నాలుగవ బహుమతి రూ. 40వేలు కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రమేష్‌బాబు వృషభాలు, అయిదవ బహుమతి రూ. 20వేలు నంద్యాల జిల్లా హుశేనాపురం గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి వృషభాలు, ఆరవ బహుమతి రూ. 10వేలు కడప జిల్లా చౌటపల్లెకు చెందిన చంద్ర ఓబుళరెడ్డి వృషభాలు గెలుచుకున్నాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిక్కన్న, దంతెల రమణ, అరుణ్‌కుమార్‌నాయక్, వెంకటరాముడునాయక్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ రీసర్వే



కొండమాయపల్లెలో భూరీసర్వే పనుల పరిశీలిస్తున్న సర్వేయర్ శ్రీరామ్ మోహన్

రుద్రవరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : భూ రీసర్వేను పకడ్బందీగా చేపట్టినట్లు సర్వేయర్ శ్రీరామ్‌మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండమాయపల్లె గ్రామంలో భూరీసర్వేను పరిశీలించారు. అనంతరం రుద్రవరం తహసీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల డివిజనులో భూ రీసర్వే 30 గ్రామాల్లో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మొదటి విడతగా 13 గ్రామాల్లో రీసర్వే ప్రారంభమైందన్నారు. వీటిలో గోస్పాడు మండలంలో ఒక గ్రామం, పాణ్యం మండలంలో ఒక గ్రామం, ఉయ్యాలవాడ మండలంలో ఒక గ్రామం పూర్తయిందన్నారు. రెండో విడత 17 గ్రామాల్లో రీసర్వే ప్రారంభమైందన్నారు. రుద్రవరం మండలంలో మొదటి విడతగా పైలెట్ ప్రాజెక్టులో బీరవోలు గ్రామం, రెండో విడతగా కొండమాయపల్లె, నాగులవరం గ్రామాలను ఎంపిక చేశామన్నారు. భూరీసర్వే పనులను 60 రోజుల్లో పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు సర్వేలో అవకతవకలు జరిగితే అందులో బాధ్యులు వీఆర్వోలేనన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మల్లిఖార్జునరావు, డిప్యూటీ సర్వే వెంకటచెన్నయ్య, మండల కన్వీనరు రమణ, వీఆర్వోలు మణికంఠ, సర్వేయర్లు జయచంద్ర, గిరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మైల తిరునాళ్ల



పాండురంగ విఠలేశ్వరస్వామి రథోత్సవం పాల్గొన్న భక్తులు

కోవెలకుంట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మైల తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. పాండురంగ విఠలేశ్వరస్వామి రథం గాంధీ సెంటరు నుంచి మెయిన్‌బజారు, సంత మార్కెట్ మీదుగా అమ్మవారిశాల వరకు రథం తిరిగి ఆలయం వద్దకు రథోత్సవం సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీసీ రామనాథరెడ్డి, కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, గువ్వల సుబ్బారెడ్డి, గడ్డంనాగేశ్‌రెడ్డి, బీవీ ప్రసాద్‌రెడ్డి, పెనుగొండ రాజశేఖర్, కరిముద్దల మురళి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వృషభాల పోటీలు ప్రారంభం

పట్టణంలోని పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వృషభాల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోదరుడు బీసీ రామనాథరెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. మొత్తం 11 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వృషభాలకు దాతలు బహుమతులు అందించారు. మొదటి బహుమతి రూ. 1.10లక్షలు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆర్‌కే బుల్స్ శిరీష చౌదరి, శివక్రిష్ణ చౌదరి, గుంటూరు అందుకున్నారు. రెండో బహుమతి కాకి రమేశ్ రూ. 90వేలు గరికపాటి లక్ష్మయ్యచౌదరి, గరికపాటి వెంకటేశ్‌లు అందుకోగా, మూడో బహుమతి కుమార్ అగ్రిగోల్డ్ బోరెడ్డి కేశవరెడ్డి పెద్దకొట్టాలు రూ.70వేలు పొంది విజేతలుగా నిలిచారు. నాలుగో బహుమతి ఐదో బహుమతి విజేతలుగా నారాయణరెడ్డి, మహిమున్‌మల్లెల నిలిచారు. టీడీపీ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున్ రెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఆళ్లగడ్డ క్రీడాకారులు

ఆళ్లగడ్డ, మే 16(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డకు చెందిన ముగ్గురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సుబ్బారాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఆర్ అకాడమీ ఆధ్వర్యంలో వివేకానంద 51 కేజీలు, కార్తీక్, ఆదిత్య 41 కేజీల విభాగంలో ఈనెల 17,18 తేదీల్లో చిత్తూరులో జరిగే జూనియర్ రాష్ట్రస్థాయి కుస్తీ(రెజ్లింగ్)పోటీలలో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను న్యాయవాది రామసుబ్బారెడ్డి, సీనియర్ క్రీడాకారుడు శేఖర్ అభినందించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

దొర్నిపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. శుక్రవారం దొర్నిపాడు అంగన్‌వాడీ మూడవ కేంద్రంలో కిషోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకటసుబ్బమ్మ, లక్ష్మీదేవి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలకు స్పందన

సంజామల, మే 16 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పుస్తక నిక్షిప్త కేంద్రంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ కేంద్రాలకు స్పందన లభిస్తుంది. శుక్రవారం గ్రంథాలయ నిర్వాహకులు టి. మద్దిలేటి ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరానికి విద్యార్థులు హాజరై కాపీ రైటింగ్ , కథలు చదవడం, బొమ్మలు గీయడం, చెస్, స్నేక్ అండ్ ల్యాడర్ ఆటలు ఆడించారు. ఒక గంటపాటు సమయం వెచ్చించి శిబిరంలో కూర్చొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను నిర్వాహకుడు అందజేశారు.

బాలికలు జాగ్రత్తలు పాటించాలి

డోన్ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు కౌమార దశలో జాగ్రత్తలు పాటించాలని సీడీపీవో శంషాద్ బేగం అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్లు 26, 27లో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలికలు కౌమార దశలో, రక్తహీనతపై తీసుకోవల్సిన జాగ్రత్తలు, వివరించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పరమేశ్వరి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, నాగజ్యోతి, ఏఎన్‌ఎం పద్మ, సచివాలయ అడ్మిన్ సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ ఎస్తేరమ్మ, షరీఫా పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ కార్డులు పంపిణీ

డోన్ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసేన పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గణేష్, జయచంద్ర, పుల్లయ్య, హుశేనాపురం జగదీష్, మధు, ఆర్య, పీఎస్‌పీకే ప్రసాద్, వీరు, పాపారాయుడు, ప్యాపిలి మధు నాయుడు, చంద్ర, సునీల్, రమేష్, జయరాం, బేతంచెర్ల మధుకుమార్, ఆవుల రాజశేఖర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

● రాములోరి ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు



నవగ్రహ పూజల్లో పాల్గొన్న సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు దంపతులు

డోన్ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో శ్రీరాములవారి ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పురోహితులు ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. ప్రత్యేక హోమా ల్లో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటనాయునిపల్లె శ్రీనివాసులు యాదవ్ కుటుంబ సభ్యులు, సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు దంపతులు, నాయకులు సీలం భాస్కర్ నాయుడు దంపతులు పాల్గొన్నారు. నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఆదివారం ధ్వజస్తంభ, రాములవారి విగ్రహప్రతిష్ఠకు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరుకానున్నారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు డోన్‌లో తిరంగ ర్యాలీ

డోన్ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంగా ముగిసిన సందర్భంగా శనివారం సాయంత్రం డోన్ పట్టణంలో భారీ తిరంగ ర్యాలీని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పాల్గొంటారని పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయం నుంచి పాతబస్టాండు గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. పార్టీలకతీతంగా నిర్వహించే ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

చౌడేశ్వరీమాత ఆలయ అభివృద్ధికి విరాళం

బనగానపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి) : నందవరం చౌడేశ్వరీ మాత ఆలయం అభివృద్ధికి నందవరం గ్రామానికి చెందిన భక్తుడు దాసరి చిన్న చెన్నయ్య, కేశాలమ్మ కుటుంబసభ్యులు రూ. 25,116 విరాళాన్ని అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ పీపీ కుమార్‌రెడ్డి సమక్షంలో అర్చకులకు అందజేశారు.అనంతరం అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

ఘనంగా టీజీ వెంకటేష్ జన్మదిన వేడుకలు

బనగానపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అమ్మవారిశాలలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిశాలలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారు లలిత, ఆర్యవైశ్యులు నారాయణ, వెంకట సుబ్రహ్మణ్యం, ప్రకాష్, వెంకటేశ్వర్లు, మధు, శివ, శ్రీను పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు

ఆళ్లగడ్డ మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ రెగ్యూలర్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నట్లు చీఫ్ సూపరిండెంటెంట్ గంగన్న తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జంబ్లింగ్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 41మంది డిగ్రీ విద్యార్థులకు గాను 29 మంది మాత్రమే పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షల పరిశీలకుడిగా బషీర్ బాష వ్యవహరించారు.

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అకౌంట్స్ ఆఫీసర్ లక్ష్మిదేవి

ఆళ్లగడ్డ, మే 16(ఆంధ్ర జ్యోతి): ఆళ్లగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని జిల్లా అకౌంట్స్ అధికారి లక్ష్మీదేవి శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డ ట్రెజరీ పరిధిలోని పెన్షన్లకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించామన్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి సుశీల, అకౌంట్స్ అధికారి వెంకటరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

చాగలమర్రి, మే 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వేద పండితుల ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవీమాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వెండిరథంలో అమ్మవారిని కొలువుదీరింపచేసి పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ప్రతిపాదనలు

చాగలమర్రి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో అసంపూర్తిగా నిలిచిన సీసీ రోడ్డు పనులు చేపట్టేందుకు రూ. 10లక్షల ఉపాధిహామీ నిధులతో ప్రతిపాదనలు పంపినట్లు పీఆర్ ఏఈ కొండారెడ్డి శుక్రవారం తెలిపారు. అలాగే జ్ఞానాపురం రహదారిలో గండిపడ్డ కల్వర్టు మరమ్మతులకు రూ.10 లక్షలతో ప్రతిపాదనలు చేశామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. మద్దూరు, పెద్దబోదనం గ్రామాల్లో ఎస్సీ గ్రాంట్ కింద రూ.20 లక్షలతో ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

చాగలమర్రి, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాల పరిధిలోని ఆయా గ్రామాల్లో భూసార పరీక్షలు చేసేందుకు మట్టి నమూనాలను సేకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు, వీహెచ్‌ఏలు ఉన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదు

రుద్రవరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదని ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం రుద్రవరంలో మంచినీటి పథకాలను ఇన్‌లైన్ క్లోరినేషన్ తనిఖీ చేశారు. ఆర్వోప్లాంటును పరిశీలించి కెమికల్ ఏ మోతాదులో వాడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రతివీధికి తాగునీరు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయకట్టు పన్ను వసూలు చేయండి

రుద్రవరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 19 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఆయకట్టు పన్ను వసూలు చేయాలని తహసీల్దారు మల్లిఖార్జునరావు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామ పరిధిలో తెలుగుగంగ చెరువులకు సంబంధించి ఆయకట్టు పన్ను వసూలు చేయాలన్నారు. ఆయకట్టు పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు.

20న దేవాలయ భూముల కౌలు వేలం

రుద్రవరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీరవోలు గ్రామపరిధిలో ఉన్న వేణుగోపాలస్వామి దేవాలయ భూములకు ఈ నెల 20న కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఈవో రామాంజనేయశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ రూ. ఐదువేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు దేవాలయ కౌలుభూముల్లో పాల్గొని వేలం పాల్గొనాలని కోరారు.